# హీమేన్

కొడుకుపెళ్ళి సందర్భంగా హోటల్ ఇండియానాలో బ్రహ్మాండమైన రిసెప్షన్ ఏర్పాటుచేశాడు శంకరం. "ఇంక ఆ గ్లాసుకింద పెట్టి, ఆ తినేదేదో తొరగా తినేసిరండి పోదాం. ఇప్పటికే లేటయింది.'' అంటూ ముచ్చటగా మూడో సారి హెచ్చరించింది మా ఆవిడ. పావుగంటకోసారి లేవడం, మళ్ళీ ఎవళ్ళో ఒకళ్ళు వొచ్చి ఛియర్స్ అనడం - ఇలా యిప్పటికే గంటన్నరయింది. పలకరింపులు, వేళాకోళాలు, జోక్సు, నవ్వులూ, అభినందనలు— ఒకటే కోలాహలం!

సడన్‌గా చుట్టూ నిశ్శబ్దం ఆవరించింది. అందరి కళ్ళూ గుమ్మంవేపు మళ్ళాయి. సతీసమేతంగా జస్టిస్ రామనాథం ప్రవేశించడంతో శంకరం, భార్యా ఎదురెళ్ళి ఆహ్వానించేరు. మిసెస్ రామనాథం నా పక్కనుంచే ఠీవిగా నడుస్తున్నప్పుడు, ఇంటిమేట్ పరిమళం కెరటంలాగ ఆ వాతావరణాన్ని ముంచేసింది. జస్టిస్ రామనాథానికి హోదాకితగ్గ హుందాతనం, వాక్చాతుర్యం, వేషభాషల్లో అభిరుచి వున్నాయి. అన్నింటికీ మించి మంచి వాడనే పేరుంది. వాళ్ళిద్దరూ బేరర్ తెచ్చిన ట్రేలోంచిం విస్కీగ్లాసు అందుకున్నారు. శంకరం బలవంతంతో మళ్ళీ గ్లాసందుకుని వాళ్ళతోబాటు ఛీర్స్ అన్నాను. జడ్జిగారు మంచి జోక్సువేస్తూ సరదాగా కబుర్లు చెబుతున్నారు. ఆవిడ తన గ్లాసు తీసుకుని లేడీస్ వైపువెళ్ళింది.

"ఇది ఆయనకి రెండో పెళ్ళాం. మొదటిభార్య పోయింతర్వాత పదేళ్ళ క్రితం దీన్ని చేసుకున్నాడు'' అంటూ రవీంద్ర నా చెవిలో వూదేడు. కాస్త ఫేషనబుల్‌గా వున్న ఆడది కంటబడితే చాలు - ఏవో రంకులూ, బొంకులూ అంటగట్టడం వాడికో దురలవాటు. ఇంతకీ నేనావిణ్ణి అంతగా పరకాయించి చూడలేదు.

ఇంతలో మా ఆవిడ ప్రత్యక్షమై నాచెయ్యి పట్టుకుని పక్కకి లాక్కెళ్ళి "ఆ జడ్జీగారి భార్యెవరో తెలుసా? సరళండీ! వైజాగ్‌లో మనమున్న యింట్లో

కిందవాటాలో..." అంటుంటే - "వాట్! నువ్వు సరిగ్గా చూశావా?" అని అడిగేను విస్తుపోయి.

సరళే నన్నానవాలు పట్టి పలకరించింది. మిమ్మల్ని గురించి అడిగింది. ఇదిగో, యిటే వొస్తుంది. పలకరించండి" అంటుంటే నావైపు ఠీవిగా నడిచివొస్తున్న సరళని చూసి ఆనవాలు పట్టేను.

* * *

విశాఖపట్నం మేము విడిచిపెట్టి పదిహేనేళ్ళయింది. అక్కడ మెంటల్ హాస్పటల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా వుండేవాణ్ణి. డాబా గార్డెన్స్‌లో మేడమీద పోర్షన్‌లో మేము అద్దెకుండేవాళ్ళం. కింద రెండు భాగాల్లోనూ ఓ భాగంలో సరళా ఆమె తల్లితండ్రులూ వుండేవాళ్ళు. రెండో భాగంలో ఆ యింటి వోనర్ రఘూ అతని తల్లీ వుండేవారు. ఆ రోజుల్లో సైకియాట్రిస్ట్‌గా నాకంత పెద్ద ప్రాక్టీస్ వుండేదికాదు. కబుర్లూ, పిక్‌నిక్‌లూ సినిమాలూ, పేకాటా-వీటితో మంచి కాలక్షేపమయ్యేది.

రఘు ఒక్కడే కొడుకవడంవల్ల గారాబంగా తల్లి పెంచింది. బేంక్‌లో ఉద్యోగం దొరకడంతో ప్రయోజకుడయ్యేడని సంతోషించింది. అప్పటికి ఇరవై మూడో యిరవైనాలుగో ఏళ్ళుంటాయి. అందమైన మొహమే కాని కుర్రాడు పొట్టిగా పీలగా వుండేవాడు. సినిమా కబుర్లు చెబుతూ సరదాగా వుండేవాడు. తల్లి ఎన్ని మంచి మంచి సంబంధాలు తీసుకొచ్చినా వొద్దుపొమ్మనేవాడు.

సరళ స్వయంకృషితో బేంక్ ఆఫీసర్‌గా డైరెక్ట్‌గా రిక్రూటయింది. తల్లితండ్రులకి ఈ అమ్మాయి మూడో సంతానం. కొడుకు స్టేట్స్‌లో స్థిరపడిపోయి వీళ్ళని గురించి పట్టించుకోడం మానేసేడు. పెద్దకూతురు భర్తతో పాట్నాలో వుంది. ప్రస్తుతం తండ్రికొచ్చే పెన్షనూ, సరళ జీతం తప్పితే వేరే ఆస్తిపాస్తుల్లేవు. సరళకి ముప్పయిరెండేళ్ళుంటాయి. మాంచి వొడ్డూ పొడుగూను. కళైన మొహమే కాని, ఛామనఛాయకంటే ఓ ఛాయ తక్కువే. దానాదీనా యింతవరకు పెళ్ళి కాలేదు. మొదట్లో పెద్ద పెద్ద సంబంధాలకి ఎగబడి చిన్న సంబంధాలు కాలతన్నేరు. ఇప్పుడు పెళ్ళయితే చాలని, ప్రకటనలు కూడా తరచు పత్రికలకిస్తున్నారు. అక్కా, అన్నా కులాంతర వివాహాలు చేసుకోవడంతో సరళ పెళ్ళి సమస్య మరింత తీవ్రమైంది. ఇప్పట్లోలాగ పదిహేనేళ్ళ క్రితం కులాంతర

వివాహాల్ని సమాజం ఆదరించేది కాదు. సరళ చాలా చురుకైంది. తెలివైంది, మాటకారి. కాని, పెళ్ళి విషయంలో అదృష్టం కలిసిరాలేదు.

''రఘుని సరళకిచ్చి పెళ్ళిచేస్తే ఎలాగుంటుంది?" అంది మా ఆవిడ.

''ఎవరిని ఎవరికిచ్చి?"

''అయ్‌మీన్ సరళని రఘుకిచ్చి....'' అంది నాలిక్కరుచుకుంటూ.

''ఏమిటి కొత్తజోకు?''

"జోక్ కాదు, మానసిక శాస్త్రవేత్తగా ఈ ప్రశ్నకి సమాధానం చెప్పండి "

''ఆ ప్రశ్న వొచ్చినప్పుడు ఆలోచిద్దాం.''

''ఆ ప్రశ్న వొచ్చింది.''

''నీ బ్రెయినువేవా? వాటే సిల్లీ అయ్‌డియా!'' అన్నాను.

''మీరు గొప్ప సైకియాట్రిస్ట్. నేను మానసికశాస్త్రం తెలియని మొద్దుని. పోనీ, సైంటిఫిక్ క్యూరియాసిటీతో అడుగుతున్నాననుకోండి.''

''నీకు సరళ వయస్సుందనుకో, నీకింకా పెళ్ళి కాలేదనుకో, రఘుని పెళ్ళాడ్డానికి ఒప్పుకుంటావా?''

''తీరుబడిగా ఆలోచించి చెప్తాను. ముందు ఈ విషయంలో మీ అమూల్య అభిప్రాయం సెలవియ్యండి.''

''ఏమిటా అర్జెన్సీ?''

"అర్జెన్సీయే మరి. ముందో వెనకో ఆ యిద్దరూ యివ్వాళ మిమ్మల్ని విషయంలో సంప్రదించదల్చుకున్నారు.''

''అసలు ఎలా మొదలైందీ వ్యవహారం?'' అడిగేను ఆశ్చర్యంగా.

''సరళకి పెళ్ళికొడుకు కావాలని ఈ నెలలో రెండుసార్లు పత్రికల్లో పడింది కదా! ఆ ప్రకటన గురించి రఘుకి తెలుసు. రెండుసార్లూ కూడా దరఖాస్తు పెట్టేట్ట. మొదటిసారి నిజమో వేళాకోళమో తెలియక నవ్వి వూరుకుంది రెండోసారి వుత్తరంలో 'నిన్ను సంవత్సరంనుంచి గాఢంగా ప్రేమిస్తున్నాను. నీతో సూటిగా చెప్పే ధైర్యంలేక ఇలా దరఖాస్తు ద్వారా తెలుపుకుంటున్నాను' అని రాశాట్ట. అంచేత యిప్పుడు సీరియస్‌గా ఆలోచిస్తుంది.''

కథా నిలయం
3473
శ్రీకాకుళం



''నువ్వే నన్ను పెళ్ళాడటమేమిటి నీ మొహం అని సరళ రఘుని చివాట్లు పెట్టలేదన్నమాట!'' అన్నాను సాలోచనగా.

''నిన్న రఘూతల్లి వెళ్ళి సరళతోనూ, ఆమె తల్లిదండ్రులతోనూ ఈ పెళ్ళికెలాగైనా ఒప్పుకోమని బతిమాలిందట.''

''రఘూ తల్లి కూడా ఇష్టపడిందా?''

"ఇష్టమో కష్టమో - ఏంచేస్తుంది? బంగారంలాంటి సంబంధాలొస్తే ఒద్దు పొమ్మన్నాడు. సరళ తనని పెళ్ళి చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేడుట. ఆవిడసలే హార్ట్ పేషెంట్. నిజంగా అంతపనీ చేస్తాడేమోనన్న భయంతో తనే రాయబారం నడిపింది.'' మా ఆవిడ ప్రశ్న వెనక యింత గ్రంథం వుందని అప్పుడే తెలుసుకున్నాను.

*　　　*　　　*

''నీకంటె వయస్సులో సరళ యించుమించు పదేళ్ళు పెద్దది. ఆమెకంటే నువ్వు పొట్టి సన్నం నీకంటే పెద్దచదువు చదివింది. మీ బేంక్ లోనే ఆఫీసర్ గా వుంటుంది. ఈ రోజు వరకూ సరళని మేడం మేడం అంటూనే పలకరిస్తున్నావు. ఆమెని నువ్వు పెళ్ళి చేసుకుంటే........''

''నా కోరిక తీరుతుంది; ఆమె పెళ్ళి సమస్యా పరిష్కారమౌతుంది'' అన్నాడు రఘు.

''ఆమె పెళ్ళి సమస్యను గురించి నువ్వు ఆలోచించి జాలిపడి త్యాగ బుద్ధితో....''

''నో సర్! ఇందులో త్యాగం లేదు. అంతా నా స్వార్థమే. నన్ను పెళ్ళి చేసుకోటానికి ఒప్పుకుంటే ఆమె త్యాగం చేసినట్టు భావిస్తాను. నాకు ఆమె అంటే యిష్టం. నేనామెని ప్రేమించేను.''

''సరళ మీయింట్లో అద్దెకుంది కాబట్టి, మీ బేంక్ లోనే పనిచేస్తుంది కాబట్టి, ఆమెకింకా పెళ్ళికాలేదు కాబట్టి ఆమెని చూశావు, ప్రేమించావు, పెళ్ళి చేసుకుంటానంటున్నావు. సరళనే అమ్మాయి యిక్కడ లేదనుకో. అప్పుడు నీకు యీడూ జోడూ అయిన అమ్మాయిని చూసి ప్రేమించి పెళ్ళి చేసుకుందువా కాదా?''

''చేసుకోను. నేను ఎలాంటి అమ్మాయిని పెళ్ళాడదామనుకున్నానో అలాంటి అమ్మాయి ఈవిడ.''

"నాన్‌సెన్స్! నీకంటే వయస్సులో, చదువులో, ఉద్యోగంలో పెద్దది అయిన ఆడదాన్ని నువ్వెలా పెళ్ళాడదామనుకున్నావు? అది అబద్ధం. సరళని చూశాక పెళ్ళాడాలని బుద్ధిపుట్టిందని చెప్పు - నేను నమ్ముతాను." అన్నాను.

"కాదు, కాదు, కాదు. నన్ను నమ్మండి. చిన్నప్పట్నుంచీ నాకు అలాంటి పెద్దావిణ్ణి పెళ్ళిచేసుకోవాలని వుంది."

"సరళ, నువ్వు పక్కపక్కల్ని నిలబడితే దూరాన్నుంచి చూసేవాళ్ళకి తల్లీ కొడుకుల్లా వుంటారు."

"అవును, అందుకే నాకిష్టం."

"సరళ నిన్ను పెళ్ళిచేసుకోనంటే?"

'ప్లీజ్, డాక్టర్‌గారూ! మీరు గట్టిగా చెప్పండి,మీరు చెబితే ఆవిడవింటుంది."

"చెప్పినా ఒప్పుకోకపోతే?"

"నేను రైలుకిందపడి చస్తాను."

* * *

"ఏమిటండీ, రఘు అలా అంటాడు? చక్కని చిన్నపిల్లను చేసుకోవాలనుకుంటారు కాని...."

"రఘూకి అటువంటి కోరిక కలగడం అసహజం కాదు. 'షిజోఫ్రీనియా' అని- అదొక వింత మానసిక స్థితి. పెరిగిన వాతావరణం ప్రభావంవల్ల కలిగిన కోరికల ప్రాబల్యంతో యిటువంటి మానసిక స్థితి సంభవించడం సర్వసామాన్యం. తండ్రి మూడోయేట పోయేడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకునీ, తల్లి ప్రాణప్రదంగా పక్కలోనే పడుకోబెట్టుకుని గారాబంగా పెంచి ఉంటుంది.ఏమైపొతాడో నన్న భయంతో బయటికి వెళ్ళనిచ్చి వుండదు. అంచేత తల్లి స్నేహితుల్తోనే రఘుకి పరిచయం ఎక్కువ. పాతికేళ్ళ వితంతువుకి ఎలాంటి స్నేహితులుంటారు? ఆ వయస్సువాళ్ళో అంతకంటే పెద్దమనస్సు వాళ్ళో ఆడవాళ్ళే వుంటారు. చిన్నప్పట్నుంచీ వాళ్ళనే చూస్తూ, వాళ్ళ కబుర్లే వింటూ, వాళ్ళ వొంపుసొంపుల్ని గమనిస్తూ వాళ్ళ పొందులో ఆనందాన్ని ఊహిస్తూ పెరిగేడు. అటువంటివాడికి యిటువంటి మానసిక పరిణామం సహజం" అన్నాను నోటితో ఆలోచిస్తూ.

"అదిగో, సరళ వొస్తుంది. కాస్త జాగ్రత్తగా నచ్చచెప్పండి. అసలే తల పొగరు" అంటూ మా ఆవిడ హెచ్చరించింది. పిళ్ళిద్దర్నీ వివాహబంధంతో కలపడానికి మా ఆవిడ కూడా ప్రముఖ పాత్ర వహిస్తుందని అర్థమైంది.

మా కాలనీలో కొత్తగా వెలిసిన బట్టలదుకాణంలో అమ్ముతున్న చీరల వెరైటీ, ఈ మధ్య వార్తల్లో వస్తున్న కట్నాల తాలూకు ఆత్మహత్యలు, మానభంగాలు, ఇటీవల రిలీజైన సినిమాల్లో కనబడే అశ్లీల సాహిత్యం, మితి మీరిన శృంగారంమీద కొంతవరకూ సింహావలోకనం చేసింది మా ఆవిడ. సరళ ముక్తసరిగా సమాధానాలు చెప్పే ధోరణి,విని ఆలోచనలతో సతమతమవుతూ టెన్షన్‌లో వుందని గ్రహించేను. ప్రకటనలద్వారా ఇటీవల సేకరించిన పెళ్ళికొడుకుల వివరాలడిగేను.

"రెండో పెళ్ళివాళ్ళు, వికలాంగులు, నా సంపాదనకోసం ఎగబడేవాళ్ళు, అనాకారులూ....నా వయస్సులో ఉన్నదానికి యింతకంటే మంచి సంబంధాలొస్తాయనుకోవడం అవివేకం" అంది. ఆ మాటల్లో నిర్లిప్తత, నిరాశ వింటుంటే జాలేసింది.

"రఘు నీకు వుత్తరాలు రాశాడుట కదూ?" అన్నాను రంగప్రవేశం చేస్తూ.

"సిల్లీ సెంటిమెంటల్ స్టఫ్! మానసికంగా వయస్సుకు మించి ఎదిగిన కుర్రాడో, వయస్సుకు తగ్గట్టు ఎదగని యువకుడో రాసినట్టున్నాయి ఆ వుత్తరాలు" అంది సరళ.

"యు ఆర్ రైట్! రఘు తల్లి చాటున పెరిగేడు. నాట్ మచ్ ఎక్స్‌పోజ్డ్ టు ది సొసైటి. కల్లాకపటం ఎరగని బుద్ధిమంతుడు" అన్నాను.

సరళ మాట్లాడలేదు; ఆలోచిస్తుందనుకుంటా!

"వేరే సంబంధాలేమైనా కన్సిడర్ చేస్తున్నావా?" అడిగేను.

"లేదు. అవన్నీ యూస్‌లెస్ కేస్‌లు. చెత్తబుట్టలో పారేశాను. ఇంక యిలాంటి ప్రకటనలివ్వొద్దని మా నాన్నగారికి గట్టిగా వార్నింగిచ్చేను. నాతో చెప్పకుండా యిచ్చేరు. వొచ్చిన వుత్తరాలు చదువుతుంటే నేను పెళ్ళి చేసుకుని గౌరవంగా జీవించడానికి అర్హతవున్న ఒక ఆడదాన్ననే ఆత్మవిశ్వాసం కూడా పోతుంది."

"ఒకనాటి మన నాగరికత, సంస్కృతి అంటూ గొప్పలు చెప్పుకోడమే కాని, ఈనాటి సామాజిక విలువలు గ్రహించాలంటే మధ్యతరగతి కుటుంబాల్లో పెళ్ళిళ్ల చూస్తే తెలుస్తుంది" అన్నాను ఓదార్పుగా.

"పెళ్ళిచేసుకోవాలని ఆరాటపడే ఆడదానికే ఈ సమస్య. డబ్బూ హోదా ఉండి పెళ్ళిచేసుకోకుండా ఎలా తిరిగినా కిక్కురుమనదీ లోకం" అంది. ఆ మాటల్లో తిరుగుబాటు ధ్వనిస్తుంది.

"అయితే, పెళ్ళి మానెయ్యదల్చుకున్నావా?"

"ఇంతవరకూ అనుకోలేదు. అవకపోతే బెంగెట్టుకోను."

"రఘూ విషయంలో నీ అభిప్రాయేమిటి?"

"బేషరతుగా, మనస్ఫూర్తిగా నన్ను పెళ్ళిచేసుకోవాలని కోరుకుంటున్న ఏకైక పెళ్ళికొడుకు రఘు. అతని వుత్తరాలు సిల్లీగా, వల్గర్‌గా వున్నాయి. దే మేడ్ మీ బ్లష్. నేను పెళ్ళాడితే భార్యనవుతానన్న భావం నాకు కలగటం లేదు. అతన్ని భర్తగా ఊహించలేకపోతున్నాను. కాని, పది సంవత్సరాలుగా భర్తని వెతుక్కోవడంలో అలసిపోయేను, ఇప్పుడు అతన్ని పెళ్ళి చేసుకోనంటే అతను ఏ ఘాయిత్యమైనా చేసుకోవచ్చు. ఈ పెళ్ళి జరిగితే నన్ను చూసి నవ్వే వాళ్ళుంటారు. పెళ్ళి పెడాకులులేని ఆడది పడే అవమానంకంటే దీన్నిభరించడం సులభం అనుకుంటాను. మీరేమంటారు?"

"మీ వయోభేదం అసాధారణం కావచ్చు కాని, యిలాంటి పెళ్ళిళ్ల చేసుకుని ఎంతమందో ఆనందంగా సంసారాలు చేసుకున్న వాళ్లుంటున్నారు. కాని, దానికి యిద్దరూ మనస్ఫూర్తిగా ఒప్పుకోవడం చాలా అవసరం. రిస్కుతో కూడుకున్న ఒక ప్రయోగం అనుకునో, త్యాగం అనుకునో పెళ్ళి చేసుకుంటే తీవ్రమైన మానసిక అసంతృప్తి కలుగుతుంది. అది భయంకరమైన దుష్పలితానికి దారి తియొచ్చు" అని హెచ్చరించాను.

"మనస్ఫూర్తిగా ఎలా ఒప్పుకోగలను? నేను కోరుకునేది నాకంటే మానసికంగా ఎదిగిన డామినేటింగ్ హీమేన్. అలాంటివాడు కొట్టినా తిట్టినా భరించగలను. అంతేకాని, నా అడుగులకి మడుగులొత్తుతూ కొంగట్టుకు తిరిగే యిలాంటి.... క్షమించండి నేను సమాధానపడలేకుండా వున్నాను."

"అంత్యనిష్ఠూరంకంటె ఆదినిష్ఠూరం నయం. రఘూమీద జాలిపడి...."

''నో, డాక్టర్ జాలిపడికాదు. నాకింక పెళ్ళయ్యే యోగ్యత లేదు. పెళ్ళి కోసం దిగులుపడుతూ, కూర్చోవడం మానేసి ముందుసంగతి ఆలోచించుకోవాలని తీర్మానించుకున్నా. ఈ పరిస్థితిలో 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకుంటాను. నువ్వు లేకపోతే నేను బతకలేను' అని రఘూ అంటుంటే, ఒక యువకుణ్ణి ఆకర్షించే సామర్థ్యం నాకుందనే భావం నాకెంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. ఇది అబద్ధం, భ్రమకాదని రుజువు చేసుకోడానికైనా నేను పెళ్ళి చేసుకుంటాను'' అంది ఆలోచిస్తూ, ఒక్కొక్క మాటే నొక్కి-నొక్కి పలుకుతూ.

నా ఆత్మవిశ్వాసాన్ని రుజువు చేసుకోడానికి పెళ్ళాడతానన్న వాదన నాకు నచ్చలేదు. పరిస్థితులతో రాజీపడి మనస్ఫూర్తిగా పెళ్లాడటానికి ఆత్మవిశ్వాసం కావాలి.

''ఏమిటండీ, ఏదో మహాత్యాగం చేసినట్టు మాట్లాడుతుంది? రఘు యిష్టపడి పెళ్ళాడతానన్నందుకా యీ బెట్టుసరి? అతనేమీ బొడ్డూడని పసిపిల్లాడా? ఆ వయస్సులో పెళ్ళిళ్ళు చేసుకుని ఎంత మంది తండ్రులు కాలేదూ?'' అంది మా ఆవిడ రఘు పక్షాన వాదిస్తూ.

''సరళ మాట అర్థం చేసుకోవాలంటే అంత వయస్సు, తెలివి తేటలు, ఉద్యోగం, తీవ్రమైన కోరికలున్న మరో ఆడదానివై యుండాలి.''

''నాన్‌సెన్స్! పెళ్ళయి మూడు నిద్దర్లయ్యేటప్పటికి అన్ని భేదాలు సర్దుకుంటాయి.''

''భర్తంటే సెక్స్ సుఖాన్ని అందించే సజీవ యంత్రంకాదు, ప్రపంచానుభవంతో సంస్కరించే గురువు, బరువు బాధ్యతలు మోసే రక్షకుడు, మనసిచ్చి లాలించి పాలించే ప్రియుడు.''

''పెళ్ళయ్యాక ప్రపంచానుభవం, బాధ్యతలు, మనస్సు-అన్నీ వాటంతటికవే వొస్తాయి, చక్కగా సర్దుకుపోతారు.''

''సర్దుకోకపోతే?''

''సర్దుకోకపోతే ఏమవుతుందేమిటి?''

''రఘు రైలుకిందపడి చస్తాడు'' అన్నాను.

* * *

''హాయ్ సరళా! హౌ ఆర్యూ?'' అని పలకరించేను.

నిండుగా, హుందాగా అందంగా కనబడుతుంది.

''ఫైన్. థేంక్యూ! మెంటల్ హాస్పటల్ సూపర్నెంటుగా వుంటున్నారుట కదా! నైస్ టు సీ యు ఆఫ్టర్ సచ్ లాంగ్ టైమ్.''

''అవును, పదిహేనేళ్లైంది'' అన్నాను.

''మీరూ మీ మిసెస్సూ తప్పకుండా మా యింటికి రావాలి, జడ్జీగారుకూడా సరదాగా కబుర్లు చెబుతారు—యు విల్ లైక్ హిం'' అంది గర్వంగా భర్తకేసి ఓ చూపు విసురుతూ.

''ఓ యస్, చూస్తున్నానుగా. సర్టన్లీ హి యీజ్ ఎ డామినేటింగ్ హీమేన్!'' అన్నాను ఓ చురక తగిలిస్తూ.

''థేంక్స్ పర్ ది కాంప్లిమెంట్. వస్తా....అయ్ విల్ జాయిన్ ది లేడీస్.... హలో, రవీంద్రగారా! గుడీవినింగ్.... మీ మిసెస్....ఓ! యివాళ శనివారం కదా, గుడికెళ్ళి వుంటారు....గుడ్‌నైట్!'' అంటూ లేడీస్ వైపు వెళ్ళింది.

''ఈవిడ నీకు తెలుసన్నమాట! దేవాంతకురాలు. అయితే, మా పినతల్లి కొడుకు రఘునికూడా ఎరిగివుంటావు!'' అన్నాడు రవీంద్ర.

ఈలోగా జస్టిస్ రామనాథంగారు మా వైపు వొస్తుంటే నోరు మూసుకోమని రవీంద్రకి సౌజ్ఞ చేశాను.

రఘూ సరళ పెళ్ళిచేసుకోడానికి నిశ్చయించుకున్న నెల్లాళ్ళకి రఘూ తల్లి గుండెపోటుతో పోయింది. దాంతో వాళ్ళ పెళ్ళిముహూర్తం వాయిదా పడింది. ఈలోగా నాకు హైదరాబాద్ ట్రాన్స్ఫరయింది. మళ్ళీ వాళ్ళ కబురు మాకు తెలియలేదు. రఘు సంగతి రవీంద్రనడిగి తెలుసుకోటానికి, నాలుగడుగులు రామనాథంగారటు వేసేవరకూ వెయిట్ చేసేను.

*   *   *

రాత్రి కార్లో తిరిగొస్తుంటే సరళని గురించి తను సేకరించిన వివరాలు దండకంలా చదవడం మొదలెట్టింది మా ఆవిడ.

"ఇప్పుడు రెండువేలయిదువొందలు జీతం, పబ్లిక్ స్కూల్లో చదువు కుంటున్న ఎనిమిదేళ్ళ కొడుకు. వాళ్ళాయన, అదే జడ్జిగారు మంచి సరదా అయినవాట్ట ఇద్దరికీ చెరో కారూ వున్నాయట జడ్జిగారి మొదటి భార్యకో కొడుకూ కూతురూ వున్నారు. పెళ్ళిళ్ళు కూడా చేసుకుని యిద్దరూ స్టేట్స్‌లోనే సెటిల్ అయ్యేరుట. అసలు వాళ్ళ పెళ్ళెలాగయిందో...."

"నాకు తెలుసు. మనకి ట్రాన్స్‌పరై యిక్కడికొచ్చేసిన రెండేళ్ళకీవూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. రామనాథంగారి చెల్లెలు కూడా వీళ్ళ బేంక్‌లోనే ఆఫీసరు ఆవిడ స్నేహంతో రామనాథంగారితో పరిచయం, ఆ తర్వాత పెళ్ళి అయింది" అని పూర్తిచేశాను.

"అవునుటండీ? యివన్నీ మీకెలా తెడుసు?"

"రవీంద్ర చెప్పేడు. రఘు రవీంద్ర పినతల్లి కొడుకు."

"మరి రఘు ఎలా వున్నాడు?"

"నువ్వడగ లేదా?"

"అడిగేను. అదంతా పెద్దకథ, తర్వాత చెప్తాను అని దాటేసింది."

"పెద్ద కథేంకాదు, చిన్నకథే. రఘుని పెళ్ళిచేసుకుని రెండేళ్ళు కాపరం చేసి, ఆ జీవితం మీద విసుగెత్తి అతన్ని విడిచిపెట్టి ఈ వూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకుందిట."

"మరి రఘు?"

"రైలు కిందపడి చచ్చిపోయేడు" అన్నాను.

*

('యువ' దీపావళి ప్రత్యేక సంచిక, 1985.)